www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 29 నవంబర్ 2025

కార్మికుల హక్కులపై దాడి దుర్మార్గం

మహాసభలో రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.అజయ్ కుమార్

- ఘనంగా సిఐటియు 9వ జిల్లా మహాసభ
- కార్మికుల మహా ప్రదర్శన

కార్మిక మహాప్రదర్శనను ప్రారంభిస్తున్న సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఆర్‌వి.నరసింహారావు

ప్రజాశక్తి- పలమనేరు: చిత్తూరు జిల్లా సిఐటియు 9వ జిల్లా మహాసభలు శుక్రవారం పలమనేరులో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మొదట బస్టాండ్ దగ్గర నుంచి కార్మిక మహా ప్రదర్శన మదనపల్లి రోడ్డులోని ఏవీసీ కళ్యాణ మండపం వరకు జరిగింది. అనంతరం ప్రారంభ సభలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.అజయ్ కుమార్ మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం లేబర్ కోడ్స్ తీసుకువచ్చి కార్మికుల హక్కులపై దాడి చేయడం దుర్మార్గమన్నారు. గతంలో అనేక ప్రభుత్వాలు కార్మికుల హక్కులపై దాడి చేసినప్పుడు దేశవ్యాప్తంగా ఐక్య పోరాటాలు చేసి కార్మికులను ఒక తాటిపై తీసుకువచ్చి పోరాటం చేసిన ఏకైక కార్మిక సంఘం సిఐటియు అన్నారు. భవిష్యత్తులో తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం కార్మికులు పోరాటాలు చేసే హక్కు లేకుండా చేసిందన్నారు. 44 కార్మిక చట్టాలు కార్మికులకు అండగా ఉంటే వాటిని రద్దు చేసి కార్పొరేట్ యాజమాన్యాలకు అనుకూలంగా లేబర్ కోడ్స్ తీసుకువచ్చారని దీని వలన కార్మికులు యూనియన్ పెట్టుకునే హక్కు కోల్పోతారని తెలిపారు. సుప్రీం కోర్టు స్కీం వర్కర్లకు సమాన పనికి సమానమైన వేతనం ఇవ్వాలని, కనీస వేతనం అమలు చేయాలని తీర్పు ఇచ్చినా అమలు చేయకపోవడం దారుణమన్నారు. దేశవ్యాప్తంగా కార్మికుల హక్కులపై నిరంతరం పోరాటం చేస్తున్న సిఐటియు కార్మిక సంఘాన్ని చిత్తూరు జిల్లాలో కూడా బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఆర్‌వి.నరసింహారావు మాట్లాడుతూ కేంద్రంలోని మతోన్మాద బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలపై దాడి చేస్తూ కార్మికులకు అన్యాయం చేస్తున్నదని, గతంలో కార్మికుల సమస్యలపై వ్యతిరేకంగా నిర్ణయాలు చేసిన పాలకులకు కార్మికవర్గం తగిన బుద్ధి చెప్పిందని అన్నారు. బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా కార్మిక విధానాలు తీసుకురావడం అన్యాయమని అన్నారు. రాష్ట్రంలో కార్మికుల సమస్యల పరిష్కారంలో సమరశీల పోరాటాల నడుపుతూ కార్మికుల సమస్య పరిష్కారమయ్యే వరకు పోరాటం చేస్తున్న కార్మిక సంఘం సిఐటియు అని, అలాంటి కార్మిక సంఘాన్ని మండల స్థాయి నుంచి బలోపేతం చేయాలని అన్నారు.

కార్మిక మహా ప్రదర్శన

పలమనేరు బస్టాండ్ నుండి ప్రారంభమైన కార్మిక మహాప్రదర్శనలో జిల్లాలో ఉన్న అంగన్వాడీ, ఆశ, వీఓఏ, మధ్యాహ్నం భోజనం, హమాలీ, ఆటోవర్కర్స్, భవన నిర్మాణ కార్మికులు, 108, 104, మున్సిపల్ సంఘాల కార్మికులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ మహాసభల్లో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఓబుల్ రాజు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఈశ్వరయ్య, ఎల్ఐసి యూనియన్ నాయకులు మునిరాజా మాట్లాడారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్ర నివేదికను ప్రవేశపెట్టారు. జిల్లా అధ్యక్షులు గిరిధర్ గుప్తా, ఉపాధ్యక్షులు వాడ గంగరాజు, షకీల, మమత, గంగ, శివ, లలిత పాల్గొన్నారు.

అనంతరం మహాసభలలో పలు తీర్మాణాలు చేయడం జరిగింది

1. 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలి
2. కార్మిక శాఖను బలోపేతం చేయాలి
3. స్కీం వర్కర్లకు కనీస వేతనాలు అమలు చేయాలి
4. ఆటో కార్మికులకు సంక్షేమ పోర్టు ఏర్పాటు చేయాలి
5. అంగన్వాడీలకు వేతనాలు పెంచాలి
6. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలి
7. మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి
8. సంఘమిత్ర సమస్యలు పరిష్కరించాలి
9. పంచాయతీ కార్మికులకు రూ.20వేలు వేతనం చెల్లించాలి
10. ప్రభుత్వ సంస్థల్లో ఖాళీలను భర్తీ చేయాలి
11. పవర్ లూం కార్మికులకు కూలి రేట్లు పెంచాలి

మహాసభలో మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షులు అజయ్ కుమార్

ప్రదర్శనలో మహిళా నాయకులు

క్లైమాక్స్‌కు.. పరకామణి కేసు

- త్వరలో ప్రభుత్వానికి సిఐడి నివేదిక
- అప్పటి టీటీడీ పెద్దల చుట్టూ బిగిస్తున్న ఉచ్చు

మాజీ టీటీడీ ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డికి నోటీసులు
విచారణ చేపట్టేందుకు సిట్ సిద్ధం..
సతీష్‌కుమార్ మృతిపైనా అనుమానాలు

తిరుమల తిరుపతి దేవస్థానం పరకామణి కేసు క్లైమాక్స్ చేరింది.. త్వరలోనే సిఐడి విచారణ తుది నివేదికను ప్రభుత్వానికి అందజేయనుంది. హైకోర్టు ఆదేశాల మేరకు సిఐడి ఈ కేసు విచారణ చేపట్టింది. ఈ కేసును సంబంధిత హైకోర్టు పరిశీలించనుంది. దీంతో సిట్ వేగవంతంగా దర్యాప్తు చేస్తోంది. టిటిడి మాజీ అధ్యక్షుడు వైవి సుబ్బారెడ్డి ఈరోజు విచారణకు హాజరు కానున్నారు. తిరుమలలో మీడియా హడావిడి అధికంగా ఉండడంతో విజయవాడలో విచారణ చేపట్టేందుకు సిట్ సిద్ధమయింది. ఇప్పటికే వైవి సుబ్బారెడ్డికి నోటీసులు అందించడంతో శనివారం ఆయన విచారణకు హాజరుకానున్నారు. దాదాపు ఈ కేసు విచారణ పూర్తయిందని తెలుస్తోంది. మధ్యలో ఫిర్యాదుదారుడు, ఆపై కేసు రాజీ చేసుకున్న సతీష్ కుమార్ అరెస్టు జరగడంతో కొద్దిపాటి జాప్యం జరిగింది. ఒకవైపు కేసు విచారణ కొనసాగుతుండగా మరోవైపు సతీష్ కుమార్ అనుమానాస్పద మృతిపై కూడా ఏపీ పోలీసులు ముమ్మర దర్యాప్తు చేస్తున్నారు. పరకామణి కేసులో అసలు విషయాలు బయటకు వస్తాయని తెలిసి సతీష్ కుమార్‌ను హత్య చేశారా? లేక ఆయన ఆత్మహత్య చేసుకున్నారా? అన్నది కూడా తెలియాల్సి ఉంది.

- ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

అప్పట్లో అలా..!

టిటిడి పరకామణిలో రవికుమార్ అనే ఉద్యోగి పనిచేసేవారు. ఆయన చేసేది చిన్న ఉద్యోగమే కానీ భారీగా ఆస్తులు సంపాదించడ పలు అనుమానాలకు తావిచ్చింది. పరకామణిని కొల్లగొట్టి ఆస్తులు కొనుగోలు చేశారన్నది ఆయనపై ఉన్న ప్రధాన ఆరోపణ. సరిగ్గా అటువంటి సమయంలోనే పరకామణిలో విదేశీ కరెన్సీ చోరీ చేస్తూ అప్పుడు విధుల్లో ఉన్న అధికారి సతీష్ కుమార్‌కు పట్టుబడ్డారు. సతీష్ కుమార్ స్వయంగా నిందితుడిని తిరుపతి ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్లో అప్పగించారు. పోలీసులకు కేసు నమోదు చేశారు. అయితే అదే కేసును కొద్ది రోజుల తర్వాత రాజీ సతీష్ కుమార్ చేసుకున్నారు. ఆ కేసును వెనక్కి తీసుకోవడంతో లోక్ అదాలాత్‌లో కొట్టివేశారు. కానీ ఇలా రాజీ చేసుకున్నందుకు గాను అప్పటి వైసిపి పెద్దలు రవికుమార్ ఆస్తులను కొంతవరకు స్వాధీనం చేసుకున్నారన్నది ఆరోపణ. పరకామణిలో చోరీకి సంబంధించి రవికుమార్ కొంత మొత్తం ఆస్తిని టీటీడీకి ఇవ్వగా.. మిగతా మొత్తాన్ని పెద్దలు కాజేసారన్నది ఆరోపణ. దానిపై కోర్టులో పిటిషన్ దాఖలు కావడంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దర్యాప్తు ప్రారంభం అయింది.

టీటీడీ పెద్దల సహకారంతో?

అప్పటి టీటీడీ పెద్దల ప్రమేయం లేకుండా.. ఈ కేసు రాజీ జరగదన్న వాదన ఉంది. అందుకే అప్పటి టీటీడీ పెద్దల చుట్టూ ఉచ్చు బిగుస్తూ వచ్చింది. అయితే ఈ కేసులో రాజీదారుడు, ఆపై ఫిర్యాదుదారుడుగా ఉన్న సతీష్ కుమార్ విచారణ ఒకసారి మాత్రమే జరిగింది. రెండోసారి విచారణకు హాజరయ్యే క్రమంలోనే సతీష్ కుమార్ అనుమానాస్పదంగా మృతి చెందారు. అయితే డిసెంబర్ 2లోగా ఈ దర్యాప్తు విచారణ పూర్తి చేయాలని కోర్టు ఆదేశాలున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో వైవి సుబ్బారెడ్డి విచారణకు విజయవాడలోని కార్యాలయానికి శనివారం రానున్నారు. అప్పటి టీటీడీ అధ్యక్షుడు కావడంతోనే ఆయనను విచారణ చేపడుతున్నట్లు తెలుస్తోంది. అదే సమయంలో వైవి సుబ్బారెడ్డి టీటీడీ లడ్డు కేసులో సైతం ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. అయితే వైవి సుబ్బారెడ్డి అరెస్టు ఉంటుందని ప్రచారం సాగుతోంది. అది పరకామణి కేసులో కాకుండా.. తిరుమల లడ్డు వివాదంలో అని తెలుస్తోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో..

జ్యోతిరావు పూలే సేవలు చిరస్మరణీయం: ఎమ్మెల్సీ



కుప్పంలో..

ప్రజాశక్తి- కుప్పం: సమాజంలో సమానత్వం, విద్యా ప్రబోధం, మహిళా సాధికారతతో పాటు అణగారిన వర్గాల హక్కుల కోసం నిస్వార్థంగా పోరాడిన మహోన్నతమైన వ్యక్తి మహాత్మ జ్యోతిరావు పూలే అని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. మహాత్మ జ్యోతిరావు పూలే 135వ వర్ధంతిని కుప్పం టిడిపి కార్యాలయంలో నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాలవేసి సమసమాజ స్థాపన కోసం ఆయన చేసిన కృషిని స్మరించుకున్నారు. కార్యక్రమంలో రెస్కో ఛైర్మన్ ప్రతాప్, కడ అడ్వైజర్ కమిటీ సభ్యులు రాజ్ కుమార్, సుగుణమ్మ, సతీష్, మున్సిపల్ అధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్, ఏఎంసీ మాజీ ఛైర్మన్ సత్యేంద్ర శేఖర్, కౌన్సిలర్ జిమ్ దాము, సోమశేఖర్ పాల్గొన్నారు.

పలమనేరు: పురపాలక సంఘ కార్యాలయంలో మాహాత్మా జ్యోతిబా పూలే 135వ వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ఎన్‌వి. రమణారెడ్డి జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మునిసిపల్ మేనేజర్ ఖాదర్ మొహిద్దీన్, కౌన్సిలర్లు కుమార్ శెట్టి, బలరాం శెట్టి (కుట్టి), సుబ్రహ్మణ్యం గౌడ్, ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ డెవలప్మెంట్ సభ్యులు నాగరాజు పాల్గొన్నారు.

చిత్తూరులో..



పలమనేరులో..

చిత్తూరు అర్బన్: ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ శుక్రవారం బీసీ సంఘాల నాయకులతో కలిసి చిత్తూరు పీసీఆర్ కూడలిలోని మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మేయర్ ఎస్.అముద, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్‌రెడ్డి, వెంకటేష్ యాదవ్, పచ్చప్ప, ఉదయ్, బీసీ సంక్షేమ సంఘం నాయకులు షణ్ముగం పాల్గొన్నారు.

యాదమరి: సామాజిక అసమానతలపై అలుపెరుగని పోరాటం చేసిన బలహీన వర్గాల ఆశాజ్యోతి జ్యోతి రావు పూలే చిర్మణీయుడు అని పిఆర్‌టియు రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ కె.కనకాచారి అన్నారు. శుక్రవారం వారు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. జిల్లా మహిళ ఉపాధ్యక్షురాలు జె.హిమబిందు శివప్రసాద్, సురేష్‌రెడ్డి, ఆనంద పిళ్లై, భాస్కరరెడ్డి, హరికృష్ణ, విశ్వనాధ్, మోహన్ కుమార్ పాల్గొన్నారు.

నిరుపేదలకు 66 సంక్షేమ పథకాలు

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపి దగ్గుమళ్ల ప్రసాదరావు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిరుపేదలకు 66 సంక్షేమ పథకాలు అమలు చేయుచున్నదని, వాటిని నిరుపేదలకు అందించవలసిన బాధ్యత సంబంధిత శాఖ అధికారులపై ఉన్నదని చిత్తూరు జిల్లా ఎంపి దగ్గుమళ్ళ ప్రసాదరావు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్లోని ప్రత్యేక సమావేశం మందిరంలో చిత్తూరు జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశం (దిశ) ఎంపీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ అర్హులైన నిరుపేదలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను చేరువ చేసి, వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు జిల్లా యంత్రాంగం చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింద జిల్లాకు రావలసిన నిధులను మంజూరు చేయడానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల యువతకు వివిధ శిక్షణ కార్యక్రమాలు, డిఆర్‌డిఏ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలో ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా అర్హులైన నిరుపేదలకు సరుకులు నాణ్యతగా పంపిణీ చేయాలన్నారు. ఇంటి నిర్మాణంలో పేదలకు సంబంధిత ఎమ్మార్వోలు పొజిషన్ సర్టిఫికెట్ ఆలస్యం చేయకుండా త్వరితగతిన మంజూరు చేయాలన్నారు. జిల్లాలో ఎక్కడ కూడా ఎస్సీ, ఎస్టీ, శ్మశానాలు లేవని ప్రజలు ఫిర్యాదు చేయరాదని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాల అమలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి అర్హులైన నిరుపేదలను ఎంపిక చేసి వారిని ఆర్థికంగా అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు. ప్రధాన మంత్రి ఉజ్వల యోజన కింద గ్యాస్ కనెక్షన్లను పెంచడానికి క్షేత్రస్థాయి అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇంటి నిర్మాణ పనులు 53,338 పూర్తి కావడం జరిగిందని, ప్రతి నెలా సరాసరి 300 గృహనిర్మాణాలు పూర్తి కావడం జరుగుతున్నదని అన్నారు. జిల్లాలో 107 ఎస్సీ గ్రామాలలో ఆదర్శ యోజన గ్రామాలను ఎంపిక చేయడం జరిగింది మొదటి విడత 66 గ్రామాలకు ఎంపిక చేయడం జరిగిందని, ప్రతి గ్రామానికి రూ.20లక్షలు చొప్పున జడ్పీ నిధుల నుంచి మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. జెడ్పి సీఈవో రవికుమార్ నాయుడు, పిఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ఎస్ఈలు చంద్రశేఖర్ రెడ్డి, విజయ్ కుమార్, డ్వామా, హౌసింగ్ పీడీలు, డీఈవో వరలక్ష్మి, సమగ్రశిక్ష ఏపీసీ వెంకట రమణ, డిఆర్‌డిఏ పీడీ శ్రీదేవి, జిల్లా వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక శాఖల అధికారులు మురళీ కృష్ణ, మధుసూదన్ రెడ్డి, సీపీఓ శ్రీనివాసులు, ఎల్డిఎం హరీష్, జిల్లా స్త్రీ శిశు సంక్షేమశాఖ అధికారి వెంకటేశ్వరి, డిపిఓ ప్రభాకర్ రావు, డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ సుధారాణి, మున్సిపల్ కమిషనర్ నరసింహ ప్రసాద్ పాల్గొన్నారు.

పీఈఎస్ పబ్లిక్ స్కూల్‌లో

6వ రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలు

పోటీలను ప్రారంభిస్తున్న జిల్లా ఎస్పీ తుషార్ డూడి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: పీఈఎస్ పబ్లిక్ పాఠశాల వేదికగా రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలు శుక్రవారం ఘనంగా ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగిందని సగర్వంగా పాఠశాల యాజమాన్యం తెలియజేసింది. పీఈఎస్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఎంఆర్.దొరస్వామి చదువుతోపాటు క్రీడలలో కూడా గొప్పగా రాణిస్తే భవిష్యత్తు ఉన్నతంగా ఉంటుందన్న ఉద్దేశంతో 2018వ సంవత్సరంలో ఈ రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలును ప్రారంభించినట్లు తెలిపారు. ఈ ఆరవ రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ కార్యక్రమానికి ముఖ్యఅతిథి ఎస్పీ తుషార్ డూడి విచ్చేసి గ్యాస్ బెలూన్లను ఎగురవేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ క్రీడలలో పోటీతత్వం ఎంత ఉన్నా వెనుకడుగు వేయకుండా ప్రయత్నం చేస్తే విజయం తప్పకుండా మన సొంతం అవుతుందని క్రీడాకారులను ఉద్దేశించి ప్రసంగించారు. అలాగే కార్యక్రమం గౌరవ అతిథి, ట్రెజరర్, బాస్కెట్ బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా టి.చెంగల్రాయ నాయుడు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలలో నిరంతర అభ్యాసం అవసరమన్నారు. ఉదయం, సాయంత్రం తప్పక ఆటల మీద శ్రద్ధ పెట్టాలన్నారు. ఈకార్యక్రమంలో మదనపల్లి, కుప్పం, ధర్మవరం, విజయవాడ, పలమనేరు, వాయల్పాడు, గుడివాడ పేటమిట్ట, బంగారుపాళ్యం, చిత్తూరు తదితర ప్రాంతాల నుండి 24 బాలల జట్టులు, 17 బాలికల జట్టులు మొత్తం 41 జట్టులు పాల్గొన్నాయి. ఈనాటి సాయంత్రానికి బాలుర విభాగంలో గుడివాడ మాంటిస్సోరి, క్యాంఫోర్డ్ పాఠశాల చిత్తూరు, బాలికల విభాగంలో పిఈఎస్ పబ్లిక్ పాఠశాల చిత్తూరు, బంగారుపాళ్యం ముందంజలో ఉన్నాయి. ఈ బాస్కెట్ బాల్ పోటీలు రేపటి వరకు కొనసాగి, చివరికి విజేతలైన వారికి బహుమతి ప్రధానం చేయడం జరుగుతుంది. ఈకార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ బాస్కెట్ బాల్ టెక్నికల్ కమిటీ ఛైర్మన్ జి.సురేష్, పీఈఎస్ పాఠశాల డైరెక్టర్ కుమారస్వామి నాయుడు, ప్రిన్సిపాల్ వైవి.కృష్ణ బాబు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారంపై శ్రద్ధ పెట్టండి

ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్

ప్రజాసమస్యలపై ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎంఎల్‌ఏ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ప్రజలు విన్నవించే సమస్యలను పరిష్కరించడంపై అధికారులు శ్రద్ధ పెట్టాలని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ చెప్పారు. ఎమ్మెల్యే వారి కార్యాలయం ప్రజాదర్బార్‌లో శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఎమ్మెల్యే అర్జీదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. వారి సమస్యలపై అక్కడికక్కడే సంబంధిత అధికారులతో చర్చించారు. సమస్యలు పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఆర్థికేతర అంశాలకు సంబంధించిన సమస్యలను వేగంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. శుక్రవారం నాటి పీజీఆర్ఎస్ కార్యక్రమంలో పింఛన్లు, కాలనీలో మౌలిక సదుపాయాలు, భూ సమస్యలు, ఇంటి పట్టాలు, గృహాలు, ఉపాధి అవకాశాల కోసం వినతులు వచ్చాయి. మొత్తం 84 వినతులు అందగా వీటిని పరిష్కార నిమిత్తం సంబంధిత శాఖలకు పంపారు. మేయర్ ఎస్.అముద, ఎంఈ.వెంకట రామిరెడ్డి, రూరల్ తహశీల్దారు కళ్యాణీ, ఎంపీడీవో శ్రీనివాసులు, సీఐ నిత్యబాబు పాల్గొన్నారు.

ఐరాల వైద్యాధికారిపై ఫిర్యాదు

ప్రజాశక్తి - చిత్తూరుఅర్బన్: ఐరాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రెడ్డెప్ప పిహెచ్‌సిలో పనిచేస్తున్న సిబ్బందిని అసభ్య పదజాలంతో తిడుతున్నారని, అత్యవసర లీవు కావలన్నా ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని, లీవు ఇవ్వాలంటే డబ్బులు డిమాండ్ చేస్తున్నారని డిఎం అండ్‌హెచ్‌ఓకి ప్రజా ఆరోగ్యవైద్య ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు ఏ.లక్ష్మీనారాయణ, జోనల్ సెక్రటరీ శ్రీనివాసమూర్తి ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ డ్యూటీ టైం ఉదయం 9 గంటలు అయితే 7 గంటలకే రమ్మని చెబుతున్నారని 7 గంటల రాకుంటే మెమోలు ఇస్తున్నారని, ఆలస్యమైతే రూ.1000లు డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. సదరు డాక్టర్‌పై డిఎంహెచ్‌ఓ విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

వేగంగా కట్టమంచి రోడ్డు పనులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: నగరంలో రహదారి విస్తరణ పనులు మరింత వేగం పుంజుకున్నాయి. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పర్యవేక్షణలో ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ మార్గదర్శకత్వంలో నగరపాలక కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ ఆదేశాల మేరకు సాంబయ్య కండిగ నుంచి కట్టమంచి వరకు జరుగుతున్న రహదారి అభివృద్ధి పనులు వేగవంతమయ్యాయి. మాస్టర్ ప్లాన్ విస్తరణలో భాగంగా రోడ్డు కోసం అవసరమైన భూ భాగాన్ని భవన యాజమానులు స్వచ్ఛందంగా అంగీకారం తెలుపుతున్నారు. ఈ మేరకు శుక్రవారం అసిస్టెంట్ సిటీ ప్లానర్ నాగేంద్ర పర్యటించి జెసిబి సహాయంతో అడ్డంకుల తొలగింపు చేపట్టారు.

నివాళులు చేస్తున్న అబ్దుల్ కలాం ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ అయూబ్‌ఖాన్

మదనపల్లె జిల్లాకు అబ్దుల్ కలాం పేరు పెట్టాలి

ప్రజాశక్తి -పుంగనూరు: మదనపల్లె జిల్లాకు భారత ప్రముఖ వైజ్ఞానికుడు, పూర్వ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం స్మృతికి చిహ్నంగా ఆయన పేరు పెట్టాలని ఏపీజే అబ్దుల్ కలాం హెల్త్ అండ్ ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ అయూబ్ ఖాన్ కోరారు. పట్టణంలోని డాక్టర్ కలాం సర్కిల్‌లో వారు శుక్రవారం నివాళులు చేశారు. ఆయన మాట్లాడుతూ మదనపల్లె జిల్లాకు కలాం జిల్లాగా పేరు మార్పు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. డాక్టర్ కలాం భారతదేశంలో విద్య, సైన్స్, యువత ప్రేరణకు చిహ్నంగా నిలిచారన్నారు. ఆయన ప్రభావం అన్ని రంగాల్లో స్పష్టంగా కనిపిస్తుందన్నారు. ఇది పేరు మార్పు మాత్రమే కాదని, యువతకు ప్రేరణ కలిగించే ఒక చిహ్నంగా నిలుస్తుందన్నారు. మదనపల్లి ప్రజలు, విద్యార్థులు, సామాజిక సంస్థలు ఈ నిర్ణయానికు మద్దతు ఇస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సంఘ సీనియర్ సభ్యులు బి నరసింహులు, కార్యదర్శి నాగరాజు, బీజేపీ సీనియర్ నాయకులు నానబాల కుమార్, రామకృష్ణ, మాజీ కౌన్సిలర్ కృపాకర్ పాల్గొన్నారు.

కేక్ కట్‌చేస్తున్న ఆర్‌టిఐ యూనియన్ నాయకులు

ఘనంగా వార్షికోత్సవం

ప్రజాశక్తి - గంగాధర నెల్లూరు: సమాచార హక్కు చట్టం యూనియన్ ఐదవ వార్షికోత్సవ వేడుకలను ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఆర్‌టిఐ యూనియన్ నాయకులు, అధికారులు కలిసి శుక్రవారం కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. అనంతరం యూనియన్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో సమాచారహక్కు చట్టం జాతీయ యూనియన్ ప్రెసిడెంట్ బండి వరప్రసాద్ రెడ్డి, ఆ యూనియన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ డి.కె.కుమార్, యూనియన్ జాతీయ సలహాదారు తిలక్, ఆర్ఐ ఏకాంబరం, వీఆర్వో సుబ్రహ్మణ్యం, సభ్యులు శ్రీనివాస్ రెడ్డి, దామోదర రెడ్డి, పరమేశ్వర రెడ్డి, గిరి, వినోద్ కుమార్ పాల్గొన్నారు.

'పచ్చదనం- పరిశుభ్రత'పై శిక్షణ

ప్రజాశక్తి -తవణంపల్లి: తవణంపల్లి మండల కేంద్రం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పచ్చదనం పరిశుభ్రతపై వివో గ్రూపు సభ్యులకు శుక్రవారం శిక్షణ ఇచ్చారు.

శిక్షణ ఇస్తున్న అధికారులు

ఎంపీడీవో హరి ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ పచ్చదనం- పరిశుభ్రత శిక్షణలో భాగంగా వివో గ్రూపు సభ్యులకు పచ్చదనం, పరిసరాల పరిశుభ్రత, పెరటి తోట పెంపకం, తడి చెత్త, పొడి చెత్త, ఇంటింటి చెట్టు ఊరంతా వనం, చెట్టు పెంచడం కాలుష్య నిర్మూలన సూత్రాలు పాటించాలని సూచించారు. వివోలు పంచాయతీలోని గ్రామాలలో స్వయం సహాయక సభ్యులకు పచ్చదనం పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. ఈ విషయాలు ప్రతి ఒక్కరూ పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సుకుమార్ రెడ్డి, వీవోలు, అధికారులు పాల్గొన్నారు.

కరపత్రాలు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

రాష్ట్ర అభివృద్ధి వేగవంతం

జిల్లా యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రం అన్ని విధాల వేగంగా అభివృద్ధి చెందుతోందని జిల్లా యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం మండలంలోని గంగాధర నెల్లూరు గ్రామ పంచాయతీలో 'రైతన్నా మీకోసం' కరపత్రాలు ఇంటింటికి వెళ్లి పంపిణీ చేసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పెనుమూరు మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణమ నాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు పాషా దాన్, సింగల్ విండో చైర్మన్ మోహన్‌నాయుడు, మండల టిడిపి ప్రధాన కార్యదర్శి కోదండ రెడ్డి, యువ నాయకుడు హరీష్ యాదవ్, టిడిపి నేతలు చిన్న మునుస్వామి, సురేష్ రెడ్డి, ఆర్ముగం పలువురు నేతలు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఎన్‌టిఆర్ ట్రస్ట్ వాహనం ద్వారా బంగారుపాళెం చేరుకుని వైద్య పరీక్షలు నిర్వహించారు.

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

డాక్టర్ ప్రవంతి ,మధు సిబ్బంది ఝాన్సీ రాణి ,బాల గణేష్ తెలిపారు. పలువురికి వైద్య పరీక్షలు చేసి తగిన మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రవంతి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో వైద్య సేవలు అందించేందుకు ఎన్టీఆర్ ట్రస్ట్ వాహనం ద్వారా గ్రామాల్లోకి వెళ్లి పలువురికి వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు.

దొంగలున్నారు..జాగ్రత్త!

-ఆదమరిస్తే వాహనాల్లో పెట్రోలు మాయం
-నిఘా పెంచాలంటున్న వాహన వినియోగదారులు

ప్రజాశక్తి -కార్వేటినగరం: మండల కేంద్రమైన కార్వేటి నగరంలో రోజు రోజుకూ దొంగతనాలు పెరిగి పోతున్నాయి. ఇంటి ఆవరణల్లో ఉన్న వాహనాల్లో కూడా వైర్లను కట్ చేసి పెట్రోలును చోరీ చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం రాత్రి సాయిబాబా నగర్ లోని ఉపాధ్యాయుడు సురేష్ ఇంటి ఆవరణలో ఉంచిన స్కూటీ వైర్లు తెంచి దుండగులు పెట్రోలు దొంగతనానికి పాల్పడ్డారు. గతంలోనూ సాయిబాబా ఆలయం వద్ద ఉన్న ద్విచక్రవాహనాన్ని దొంగలు అపహరించుకు వెళ్లినట్లు సమాచారం. మండల కేంద్రంలో చిన్న చిన్న చోరీలు చోటు చేసుకుంటున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. దొంగలు స్థానికులా? లేక బయట వారా? అనేది గ్రామస్తులకు ప్రశ్నార్థకంగా మారింది. ఆద మరిస్తే పెట్రోలుతో పాటు వాహనాలు కూడా మాయమయ్యే ప్రమాదం ఉందని వాహన దారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎవరూ లేని ఇళ్లలో తాళాలు పగలగొట్టి చోరీలకు పాల్పడే అవకాశం కూడా ఉందని, అలాంటి సంఘటనలు చోటు చేసుకోక ముందే పోలీస్ అధికారులు స్పందించి రాత్రి పూట నిఘా పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందంటున్నారు. గతంలోనూ స్థానికంగా ఉన్న ఓ ఆలయంలో హుండీ చోరీకి గురైందని సమాచారం. సాయిబాబా ఆలయ వీధిలో ఇంటి ఆవరణలో బైక్ వైర్లు కట్ చేసి పెట్రోలు అపహరించినట్లు సమాచారం..

వైర్లు కట్‌చేసి పెట్రోలును తస్కరించిన దృశ్యం

ప్రభుత్వ స్కూళ్లలో వైద్య పరీక్షలు

విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టరు రెడ్డప్ప

ప్రజాశక్తి-ఐరాల: ప్రభుత్వ స్కూళ్లలో వైద్య పరీక్షలు నిర్వహిస్తామని ఐరాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రెడ్డప్ప పేర్కొన్నారు. నాగం వాండ్లపల్లి, గోవిందరెడ్డి పల్లి సబ్ హెల్త్ సెంటర్‌లను ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎల్సిడిసి సర్వేను తనిఖీ చేశారు. సచివాలయ పరిధిలోని పాఠశాలను సందర్శించారు. సబ్ సెంటర్లోని రికార్డులు రిజిస్టర్లు పరిశీలించారు. ఎల్సిడిసి సర్వేలో భాగంగా లక్షణాలు కలిగిన వారికి డాక్టర్ పరీక్షించి చికిత్స అందించారు. ఎల్‌సిడిసి సర్వేను ఫీల్డ్ స్థాయిలో డాక్టర్ రెడ్డెప్ప తనిఖీ చేశారు. బిపి, షుగర్, కేన్సర్ లక్షణాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. సస్పెక్ట్‌ను తప్పక రెఫరల్ చెయ్యాలని పిలుపునిచ్చారు. ఎం ఎల్ హెచ్ పి, ఏఎన్ఎమ్, ఆశా కార్యకర్తలకు ఫీల్డ్ వర్క్ మెలకువలను వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ రెడ్డప్ప, సూపరువైజర్ చిన్నమ్మ, మేల్ హెల్త్ అసిస్టెంట్ మునిరత్నం, ఎం ఎల్‌హెచ్‌పి, ఎస్ జ్యోతి, ఏఎన్ఎంలు భువనేశ్వరి, భార్గవి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: టిడిపి

ప్రజాశక్తి -కార్వేటినగరం: రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం అని టిడిపి నాయకులు ప్రకాష్ పేర్కొన్నారు.

కరపత్రాలు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు ప్రకాష్

కార్వేటి నగరం మండలం ఆలత్తూరు పంచాయతీ పరిధిలో ' రైతన్నా మీకోసం' కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. అన్నదాత సుఖీభవ ఆర్థిక సాయం గురించి రైతులకు వివరించారు. కరపత్రాలు పంపిణీ చేసి కూటమి ప్రభుత్వం అభివృద్ధి గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కమిటీ అధ్యక్షులు ప్రధాన కార్యదర్శి పార్టీ సీనియర్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సాయి భవాని, అగ్రికల్చర్ అసిస్టెంట్ దయాకర్, సచివాలయా సిబ్బందులు పాల్గొన్నారు.

చేపల చెరువుల వేలం

రూ.75,500 ఆదాయం

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: మండలంలోని లక్కనపల్లి పంచాయతీ పరిధిలో చెరువులకు డిప్యూటీ ఎంపీడీవో నాగార్జున రెడ్డి పంచాయతీ కార్యదర్శి ప్రభుదాస్ ఆధ్వర్యంలో పంచాయతీ కేంద్రంలోని సంత ప్రాంగణంలో చింత చెట్లు ఫలసాయం సేకరణకు స్థానిక టిడిపి రఘుచంద్రగుప్త, సింగల్ విండో డైరెక్టర్ భాస్కర్ రెడ్డి సమక్షంలో శుక్రవారం వేలం పాట నిర్వహించారు. ఇందులో భాగంగా పంచాయతీకి 57 వేల 500 రూపాయలు ఆదాయం వచ్చినట్లు పంచాయతీ కార్యదర్శి తెలిపారు. మండలంలోని గడ్డురు పంచాయతీ పరిధిలోని చెరువులను డిప్యూటీ ఎంపీడీవో నాగార్జున రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాము, సర్పంచ్ దేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో చేపల వేలం పాట నిర్వహించారు. పంచాయతీకి రూ.22 వేల ఆదాయం వచ్చినట్లు పంచాయతీ కార్యదర్శి తెలిపారు.

వేలంపాట నిర్వహిస్తున్న దృశ్యం

స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి - రొంపిచెర్ల: సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనారిటీ (సీఈడీఎం)అందజేసిన స్టడీ మెటీరియల్ ను జెడ్పీ ఉర్దూ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఎం సుజాత చేతుల మీదుగా విద్యార్థులకు శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 10 వ తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు సీఈడీఎం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశామన్నారు. ఇందులో ఉర్దూ, తెలుగు, ఇంగ్లీషు, గణితం, సైన్స్, సోషియల్ సబ్జెక్టుల మెటీరియల్ ఉన్నాయన్నారు. ఉర్దూ ఉన్నత పాఠశాలలో 10 వ తరగతి చదువుతున్న 15 మంది విద్యార్థిని విద్యార్థులకు అందించామన్నారు. విద్యార్థులు స్టడీ మెటీరియల్ వినియోగించుకొని పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ ఉన్నత పాఠశాల స్కూల్ కమిటీ చైర్మెన్ ఖాదర్ బాషా, ఉపాధ్యాయులు గంగాధరయ్య, అక్బర్ బాషా, ఇర్ఫాన్ అలీ, మహమ్మద్ అలీ, షేక్ అబ్దుల్ రహిమాన్, మహమ్మద్ బాషా పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేస్తున్న దృశ్యం

కత్తెరపల్లి విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి -కార్వేటినగరం: రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన మాక్ అసెంబ్లీ పోటీల్లో జీడీనెల్లూరు నియోజక వర్గ స్థాయిలో కత్తెరపల్లి విద్యార్థిని పి శశిర ప్రథమ స్థానంలో నిలిచిందని ఆ పాఠశాల హెచ్‌ఎం చెంగల్రాజు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ నవంబర్ 26వ తేదీన రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన మాక్ అసెంబ్లీలో చిత్తూరు జిల్లా నుంచి ప్రతి నియోజకవర్గం నుండి పాల్గొనే విద్యార్థులను ఎంపిక చేయడానికి నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ, వ్యాసరచన పోటీలలో జీడీనెల్లూరు నియోజకవర్గం నుంచి పాల్గొన్న కత్తెరపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థిని శశిర ప్రథమ స్థానంలో ప్రతిభ కనబరిచి పాఠశాల ఉనికిని నిలబెట్టారన్నారు. దీంతో కలెక్టర్ కార్యాలయంలో సమావేశంలో కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్‌పి తుషార్ డూడి, జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ కార్యదర్శి భారతి, జిల్లా విద్యాశాఖ అధికారి వరలక్ష్మి, సమగ్ర శిక్ష ఏపీసీ వెంకటరమణలు విద్యార్థినికి ప్రశంసాపత్రంతో పాటు మెడల్ అందించి ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ క్రమంలో భాగంగా విద్యార్థిని తల్లి దండ్రులను పాఠశాల హెచ్‌ఎంను సైతం కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు విజయ కుమార్, మనోజ్‌కుమార్, పలువురు పాల్గొన్నారు.

పి శశిరకు ప్రశంసాపత్రం అందిస్తున్న దృశ్యం

జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా బిజే అనిల్ గౌడ్ నామినేషన్

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: రాష్ట్ర వ్యాప్త కాంగ్రెస్ అంతర్గత ఎన్నికల సందర్భంగా బైరెడ్డిపల్లి మండలంలో రాజకీయం వేడెక్కింది. మండల కాంగ్రెస్ సీనియర్ నేత జనార్ధన్ గౌడ్ కుమారుడు బిజే అనిల్ గౌడ్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష బరిలో దిగడంతో కార్యకర్తల్లో ఉత్సాహం నెలకొంది. ఈ నేపథ్యంలో మండలంలోని గ్రామాల పరంగా భారీ సంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలు, సభ్యులు మండల కేంద్రానికి తరలి వచ్చి అనిల్ గౌడ్‌కు మద్దతు ప్రకటించారు. పిసిసి కార్యదర్శి బిజే అనిల్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ సమావేశం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఏఐసిసి కార్యదర్శి జై కుమార్, ఆంధ్రప్రదేశ్ ఎస్‌సి అధ్యక్షుడు దామోదర్, ఏపీసీసీ ప్రధాన కార్యదర్శి బొద్దిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, చిత్తూరు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు భాస్కర్, చిత్తూరు జిల్లా డీసీసీ ప్రధాన కార్యదర్శి, మండలాధ్యక్షులు ఆర్ రామప్ప, వైయం శ్రీనివాసులు, ఖాదర్ బాషా, రమణప్ప, ఆర్‌ఎం నాయుడు పాల్గొన్నారు.

బిజే అనిల్ గౌడ్‌కు స్వాగతం పలుకుతున్న దృశ్యం

యూత్ కాంగ్రెస్ నాయకుల మద్దతు

యూత్ కాంగ్రెస్ నాయకులు శివ, హరి, రహమతుల్లా హాజరై బిజే అనిల్ గౌడ్‌కు మద్దతును ప్రకటించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష పదవిని యువ నాయకుడు చేపట్టడం పార్టీ బలోపేతానికి దోహదం చేస్తుందని అభిప్రాయపడ్డారు.

ఘనంగా 'ఫ్రెషర్స్ డే'

ప్రజాశక్తి -వెదురుకుప్పం: వెదురుకుప్పం డాక్టర్ వైఎస్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు స్వాగతం పలికేందుకు 'ఫ్రెషర్స్ డే' ఇండక్షన్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. విద్యార్థులకు కళాశాల నిబంధనలు, విద్యా వాతావరణాన్ని పరిచయం చేశారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి అన్నపూర్ణ శారద ఆతిథ్యం ఇచ్చారు. కళాశాల నాణ్యతా హామీ విభాగం పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. నూతన విద్యార్థులకు కళాశాల సదుపాయాలు, విద్యా ప్రమాణాలు, జాతీయ విద్యా విధానం సమగ్ర అవగాహన కల్పించడమే ఇండక్షన్ ప్రోగ్రామ్ ముఖ్య ఉద్దేశమని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డిగ్రీ విద్యార్థుల భవిష్యత్తుకు పునాది వంటిది అన్నారు. లక్ష్యాలను ఏర్పరచుకొని, క్రమశిక్షణతో ముందుకు సాగితే విజయం సాధించడం ఖాయమని పేర్కొన్నారు. తమ కళాశాల తరపున విద్యార్థులకు అన్ని విధాలా మద్దతు అందిస్తామని తెలిపారు. అనంతరం నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకల్లో నూతన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కళాశాల సీనియర్ విద్యార్థులు జూనియర్లకు స్వాగతం పలికి, పలు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు నిర్వహించారు. నూతన విద్యార్థులు పాటలు, నృత్యాలతో తమ ప్రతిభను ప్రదర్శించారు. కళాశాల ఐక్యూఏసి కోఆర్డినేటర్, ఇతర అధ్యాపక సిబ్బంది, విద్యార్థుల ఉత్సాహాన్ని అభినందించారు. ఈ కార్యక్రమం ద్వారా సీనియర్, జూనియర్ విద్యార్థుల మధ్య బంధం మరింత బలపడుతుందని, అకడమిక్, సాంస్కృతిక కార్యక్రమాలలో వారు చురుకుగా పాల్గొనేందుకు ప్రోత్సాహం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినివిద్యార్థులు, అధ్యాపక అధ్యాపకేతరులు పాల్గొన్నారు.

సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థిని

సత్వర పరిష్కారం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి-తవణంపల్లి: తవణంపల్లి మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా దర్బారులో ప్రజల నుంచి వచ్చిన సమస్యలు ఎమ్మెల్యే మురళీమోహన్ స్వయంగా అర్జీలు స్వీకరించి సత్వర పరిష్కారం చూపుతామని ఎమ్మెల్యే మురళీమోహన్ పేర్కొన్నారు. మండల పరిధిలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల వినతి పత్రాలను ఒకొక్కటిగా ఎమ్మెల్యే పరిశీలించారు. ప్రతి విషయం లోనూ సంబంధిత అధికారులతో తక్షణమే సమావేశం నిర్వహించారు. సమస్యలు త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. వైద్య, విద్యుత్, హౌసింగ్ తదితర శాఖల అధికారులు హాజరయ్యారు. ఎమ్మెల్యే మురళీమోహన్ మాట్లాడుతూ ప్రజలకు న్యాయం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రజా సమస్యల పరిష్కార వేదికగా మండల కేంద్రాలు ఏర్పాటు చేయడమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. మొత్తం సుమారు వంద అర్జీలు అందాయి. వాటిలో 30 శాతం అక్కడి కక్కడే పరిష్కరించామని ఎమ్మెల్యే తెలిపారు. భూ సమస్యలు, పింఛను సమస్యలు, దారి, వాగు సమస్యలు, గోకులం షెడ్ వంటి పలు విషయాలపై వచ్చిన వినతులను వెంటనే సంబంధిత శాఖలతో చర్చించి చర్యలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు వెంకటేష్ చౌదరి, దిలీప్, క్లస్టర్ కన్వీనర్లు ప్రవీణ్ నాయుడు, మోహన్ నాయుడు, ఏఎంసీ చైర్మన్ భాస్కర్ నాయుడు, రంజిత్ రెడ్డి, సునీల్ నాయుడు, కత్తి సతీష్ రెడ్డి, కంప్యూటర్ శివ ప్రకాష్, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలనుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే

సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా పట్టు పరిశ్రమ శాఖ అధికారిణి పద్మ

ప్రజాశక్తి -సోమల: సోమల మండలంలోని రైతులు సాధారణ వ్యవసాయ సాగుతో పాటు పట్టు పరిశ్రమ శాఖ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పలు పథకాలను అవగాహన చేసుకుని పట్టు పరిశ్రమపై దృష్టి సారించాలని జిల్లా పట్టు పరిశ్రమ శాఖ అధికారిణి పద్మ అన్నారు. రైతన్నా మీకోసం' కార్యక్రమాన్ని మండలంలోని ఇరికిపెంట, ఎస్ నడింపల్లి పంచాయతీలలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా పట్టు పరిశ్రమ శాఖ అధికారిణి హాజరయ్యారు. పుంగనూరు వ్యవసాయ సహాయ సంచాలకులు శివ కుమార్ మాట్లాడుతూ రైతులు మేలైన యాజమాన్య పద్ధతుల గురించి అధికారుల సూచన మేరకు పంటలు సాగు చేయాలని కోరారు. ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసులు నాయుడు మాట్లాడుతూ రైతులు ఉద్యానవన పంటలతో పాటు మామిడి, ఇతర పంటలను మార్కెటింగ్ ద్వారా మార్కెట్ యార్డుకు తరలించి అమ్మకాలు సాగించి లాభాలు అర్జించాలని కోరారు. అనంతరం రెండు పంచాయతీలలో ఇంటి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి సుధాకర్, రైతు సేవ కేంద్ర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాల కరపత్రాలు పంపిణీ చేస్తున్న అధికారులు

మానసిక ప్రశాంతతకు సంగీతం, నృత్యం అవసరం

- ప్రముఖ వైద్యుడు డాక్టర్ ప్రభాకర్

ప్రజాశక్తి -పుంగనూరు: మానసిక ప్రశాంతతకు విద్యార్థులకు నేటి సమాజంలో సంగీతం, నృత్యం లాంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ విజయ్ కుమారిలు పేర్కొన్నారు. స్థానిక ఎల్ఐసి కాలనీలో జె ఎస్ కల్చరల్ అకాడమీ వార్షికోత్సవంలో శుక్రవారం వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు వివిధ కళలు నేర్చుకుంటున్న విద్యార్థిని విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందించారు. గత నెల తిరుపతి మహతి ఆడిటోరియంలో నిర్వహించిన నృత్య పోటీలలో జెఎస్ కల్చరల్ అకాడమీ నుండి 14 మంది విద్యార్థినులు నైపుణ్యం సాధించి ప్రతిభ కనబరిచి బహుమతులు పొందారన్నారు. వారందరినీ తల్లిదండ్రుల సమక్షంలో అభినందించారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ అధ్యక్షుడు నానబాల గణేష్ మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు అనేక మానసిక ఒత్తిడిలతో అనారోగ్యాపాలవుతున్నారన్నారు. వారి మానసిక ప్రశాంతతకు, ఎదుగులకు, అరోగ్యానికి, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకునేందుకు ఇలాంటి కళలు ఎంతో అవసరం అన్నారు. జె ఎస్ కల్చరల్ అకాడమీలో సుమారు 75 మంది విద్యార్థిని విద్యార్థులు, నాలుగు సంవత్సరాలుగా వివిధ కళలు నేర్చుకుంటున్నారని, అకాడమీ నిర్వాహకులు డాక్టర్ కె జాన్స్, సతీమణి కె స్వప్న, డాన్స్ మాస్టర్ బాలాజీ కీబోర్డు, గిటారు, నేర్పిస్తున్న ఆనంద్ బెన్ ఎంతో అభినందనీయులు అన్నారు. ఈ కార్యక్రమంలో భరతనాట్యం నేర్చుకుంటున్న పిల్లలు, వారి తల్లిదండ్రులు పట్టణంలోని ప్రముఖులు పాల్గొన్నారు.

నృత్య పోటీల్లో ప్రతిభ చూపి జ్ఞాపికలు అందుకున్న విద్యార్థినులు

పాఠశాల బస్సులు తనిఖీ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: పాఠశాల బస్సుల తనిఖీలో భాగంగా శుక్రవారం స్థానిక విజయం విద్యాసంస్థల బస్సులను రవాణా శాఖ అధికారులు తనిఖీ చేశారు. బస్సు రికార్డు పత్రాలు, ఎమర్జెన్సీ డోర్, ఫైర్ సేఫ్టీ అలారమ్స్ సిస్టం పని చేసే విధానం, వేగపరిమితి వంటి వాటిని తనిఖీ చేసి సూచనలు చేశారు. అదేవిధంగా వాహన డ్రైవర్లకు, విద్యార్థులకు రోడ్ సేఫ్టీపై తగు సూచనలు చేశారు. సీనియర్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ రాజేశ్వరరావు మాట్లాడుతూ ఇటువంటి తనిఖీలు క్రమం తప్పకుండా నిర్వహిస్తామని తెలియజేశారు. మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు మురళి, నరసింహులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

అదుపు తప్పి లారీ బోల్తా

తప్పిన పెనుప్రమాదం

అదుపు తప్పి బోల్తా పడిన లారీ

ప్రజాశక్తి -కార్వేటినగరం: ఓ లారీ అదుపు తప్ప బోల్తాపడిన సంఘటన మండల పరిధిలోని అల్లాగుంట సమీపంలో చిత్తూరు – పుత్తూరు జాతీయ రహదారిపై శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. బెంగళూరు నుంచి సత్యవేడు నియోజకవర్గంలోని శ్రీసిటికి వెళుతున్న ఓ మినీ లారీ అల్లాగుంట వద్ద ట్రాక్టరును తప్పించ బోయి అదుపు తప్పి బోల్తా పడినట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో అదృష్ట వశాత్తు ఎవరికీ ఎలాంటి ప్రాణాపాయం లేక పోవడంతో స్థానికులు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం జేసీబీ సాయంతో లారీని నిలబెట్టారు. కొన్ని నెలలుగా చిత్తూరు– పుత్తూరు జాతీయ రహదారి ప్రమాదాలకు నిలయంగా మారి ఎంతో మంది నిండు ప్రాణాలు కోల్పోతున్నారని సంబంధిత అధికారులు రహదారులపై ప్రమాదాలు అరికట్టేందుకు దృష్టి సారించాలని స్థానికులు పేర్కొంటున్నారు. జాతీయ రహదారిలో నాకాబందీ నిర్వహించి మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వాహన చోదకులపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేయాలని పలువురు కోరుతున్నారు.

సంఘటన స్థలంలో పరిశీలిస్తున్న విద్యుత్ అధికారులు

కదిలిన అధికారులు

'ప్రజాశక్తి' వార్తకు స్పందన

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లి విద్యుత్ కార్యాలయం సమీపంలో గురువారం సంభవించిన విద్యుత్ షాక్ ఘటనకు సంబంధించి 'ప్రజాశక్తి' దినపత్రిలో వచ్చిన వార్తకు అధికారులు వేగంగా స్పందించారు. సమాచారం అందుకున్న వెంటనే విజిలెన్స్ విభాగానికి చెందిన హెడ్ కానిస్టేబుల్ వాసు, సంబంధిత విద్యుత్ శాఖ అధికారులతో కలిసి హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకున్నారు. సంఘటన స్థలంలో పరిస్థితులను పరిశీలించిన అధికారులు ప్రాథమిక వివరాలు సేకరించి పై అధికారులకు పంపించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖకు చెందిన దేవి ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ మండలంలో మరో కొన్ని ప్రాంతాల్లోనూ ఇదే రీతిలో ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయని గుర్తించిన విజిలెన్స్ జట్టు, వెంటనే చర్యలు ప్రారంభించారని తెలిపారు. విద్యుత్ లైన్ల భద్రత, పౌరుల రక్షణ చర్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారని సమాచారం.

ఘనంగా జ్యోతిరావ్ పూలే వర్ధంతి

ప్రజాశక్తి - రొంపిచర్ల: రొంపిచెర్ల మండల కేంద్రంలోని బస్టాండు ఆవరణలో మహాత్మ జ్యోతిరావ్ పూలే వర్ధంతిని ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జ్యోతిరావ్ పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యావేత్త డాక్టర్ టి రఘునాథ్ మాట్లాడుతూ సమాజంలోని అంటరానితనాన్ని రూపుమాపడంలో జ్యోతిరావు పూలే కృషి ఎనలేనిది అన్నారు. స్త్రీవిద్యను ప్రోత్సహించడంతో పాటు చదువుకోవడానికి వీలుగా వసతి గృహాలను ఏర్పాటు చేసి స్త్రీల విద్యాభ్యాసం కోసం కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షుడు జల్లు గిరిబాబు, ఆసరా స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు ఎన్. ఓబులేసు, సీనియర్ సిటిజన్ ఆర్. రాజన్న, ఎం జగన్ మోహన్, గిరి ప్రసాద్, మైనార్టీ నాయకులు సైపుల్లా ఖాన్, ఆటో యూనియన్ నాయకులు నాగయ్య, సుబ్రహ్మణ్యం, భాస్కర పాల్గొన్నారు.

చెరువుకు జలహారతి ఇస్తున్న ప్రజలు

చెరువుకు జలహారతి

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలోని బైరెడ్డిపల్లి పెద్ద చెరువు మొరవ కాలువ ప్రవాహాన్ని తిలకిస్తూ, చెరువు మరవ నీటికి గ్రామస్తులు శుక్రవారం జలహారతి అందించారు. టిడిపి మండల అధ్యక్షులు రాధమ్మ కిషోర్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మండల కేంద్రం, పరిసర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పెద్ద చెరువు మొరవ ప్రారంభాన్ని పురస్కరించుకొని పూజలు నిర్వహించామని వచ్చే నెల 3వ తేదీ పెద్ద ఎత్తున తెప్ప తిరణాలను ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే ప్రతి ఒక్కరికీ విందు భోజన ఏర్పాట్లు చేశాంమని తెలిపారు. మండలంలోని ప్రలు ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, యువత, పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొని చెరువు మొరవ నీటికి జలహారతి ఇచ్చారు.

BEFORE THE HON'BLE DISTRICT CONSUMER COMMISSION AT KURNOOL
C.C. No.107/2025
Smt.U.V Lakshmi. ...Complainant
VS
1.M.V.Srikanth & 2 others. ...Opposite parties
NOTICE TO O.P.NO.(1) & NO.(3)
1) O.P (1) M.V.Srikanth, Software Engineer
2) O.P.(3) M.Vijay Kumar, Real Estate Business
Both are residents of H.No.22-976/1, M.S, Plot No. (8) Brindavan Colony, Kattamanchi Revenue village, Chittoor

ఇందుమూలముగా తెలియజేయడం ఏమనగా పైన కనబరిచిన కంప్లైంట్ ఇవి లక్ష్మీ గారు మీ ఇద్దరి పైన మరియు ఓపీ నెంబర్ 2 సరస్వతి పైన కేసు ఇన్ సిసి నంబర్ 107/2025 పై కోర్టు నందు దాఖలు చేసినారు సదర్ కేసు మీ హాజరు కొరకు 15.12.2025 పై కోర్టులో ఉన్నది. కావున మీరు ఆ తేదీన 15.12.2025 ఉదయం 10:30 గంటలకు పై కోర్టు నందు హాజరై మీ ఆక్షేపణలు తెలియపరచుకొనవచ్చును లేనియెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

(BY COURT ORDER)
Y.Sreenivasulu,
advocate for complainant
Kurnool
Cell No. 9440768473

IN THE COURT OF THE PRL. CIVIL JUDGE (SENIOR DIVISION), CHITTOOR,A.P
O.S.No. 63 of 2024
Between:
Smt P. Hemalatha ....Plaintiff
And:
B. Kalpalatha & others ...Defendants
SUMMONS TO D2 AND D4
1.Rithvi Charan,
S/o Late D.Dayananda Reddy, Hindu, aged about 30 years,private employee. (D2)
2. Nitheesha
D/o Late D.Vijayananda Reddy, Hindu, aged about 30 years, House-wife, (D4)
No.2 & 4 are permanent resident of A.Reddipalli Village, Irala post and Mandal, Chittoor District A.P.
Sir,
Please take notice that the Plaintiff filed the above Suit against you and others. The said case is stands posted to 23-12-2025 for service of notice on you and you may appear at 10-30 A.M. before theabove said court either in person or through an Advocate, otherwise thematter will be decided exparte.
Sd/-D. RAJENDRA
Cousel for Plaintiff
Place:Chittoor, Date:27.11.2025

IN THE COURT OF THE PRL. CIVIL JUDGE (SENIOR DIVISION), CHITTOOR,A.P
I.A.No. 231 of 2024
O.S.No. 63 of 2024
Between:
Smt P. Hemalatha ....Petitioner/Plaintiff
And:
B. Kalpalatha & others
... Respondents/ Defendants
NOTICE TO R2 AND R4
1.Rithvi Charan,
S/o Late D.Dayananda Reddy, Hindu, aged about 30 years, private employee, (R2)
2. Nitheesha
D/o Late D.Vijayananda Reddy, Hindu, aged about 30 years, House-wife, (R4)
No.2 & 4 are permanent resident of A.Reddipalli Village, Irala post and Mandal, Chittoor District A.P.
Sir,
Please take notice that the Petitioner filed the above petition against you and others. The said case is stands posted to 23-12-2025 for service of notice on you and you may appear at 10-30 A.M. before theabove said court either in person or through an Advocate, otherwise thematter will be decided exparte.
Sd/-D. RAJENDRA
Cousel for Petitioner/Plaintiff
Place:Chittoor, Date:27.11.2025